# స్పిన్ సవాల్

## నేటి నుంచి భారత్, న్యూజిలాండ్ రెండో టెస్టు

### 'చిన్నస్వామి'కి భిన్నంగా పుణె పిచ్ • స్పిన్‌తో తిప్పేసేందుకు ఇరు జట్లు సిద్ధం

పూణె: న్యూజిలాండ్‌తో ఇటీవలే బెంగళూరులో ముగిసిన తొలి టెస్టులో అనూహ్య ఓటమిని ఎదుర్కొన్న టీమ్‌ఇండియా.. గురువారం నుంచి పుణెలో మొదలయ్యే రెండో టెస్టును గెలిచి సిరీస్‌ను సమం చేయాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే ఆలౌట్ అయినా రెండో ఇన్నింగ్స్‌లో పుంజుకున్నట్టే కనిపించిన రోహిత్ సేన మరోసారి కివీస్ పేసర్లకు దాసోహమై భారీ మూల్యాన్ని చెల్లించుకుంది. ఈ నేపథ్యంలో 'చిన్నస్వామి'కి భిన్నంగా పుణెలోని మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) పిచ్ ఉండనున్నట్టు తెలుస్తోంది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ నేపథ్యంలో పేస్ పిచ్‌లు తయారు చేయించుకుని పప్పులో కాలేసిన భారత్.. పుణెలో మాత్రం సంప్రదాయ స్పిన్ పిచ్‌పై కివీస్‌ను తిప్పేసేందుకు సిద్ధమైంది. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ సన్నాహకాల్లో ఉన్న మెన్ ఇన్ బ్లూ.. ప్రయోగాలకు పుల్‌స్టాప్ పెట్టి సిరీస్‌ను 2-1తో గెలవాలనే పట్టుదలతో ఉంది. మరోవైపు 36 ఏండ్ల తర్వాత భారత్‌లో భారత్‌ను టెస్టు మ్యాచ్‌లో ఓడించిన న్యూజిలాండ్.. పుణెలో గెలిచి సిరీస్‌ను ఇక్కడే పట్టేయాలని తహతహలాడుతోంది.

**సెలక్షన్ తిప్పలు!**

రెండో టెస్టులో రోహిత్ సేనకు సెలక్షన్ తిప్పలు తప్పేలా లేవు. మెడ కండరాల గాయంతో బెంగళూరు టెస్టుకు దూరమైన శుభ్‌మన్ గిల్ రెండో టెస్టుకు ఫిట్‌గా ఉండనున్నాడు. దీంతో మిడిలార్డర్‌లో కేఎల్ రాహుల్ లేదా సర్ఫరాజ్ ఖాన్‌లో ఎవరో ఒకరిపై వేటు పడనుంది. ఇరానీ కప్‌లో ద్విశతకం, తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 150 పరుగుల మేటి ఇన్నింగ్స్‌తో సర్ఫరాజ్ జోరుమీదున్నాడు. కానీ రాహుల్ మాత్రం బంగ్లా సిరీస్‌తో పాటు బెంగళూరు టెస్టులోనూ విఫలమవడంతో అతడిని పక్కనబెట్టాలన్న వాదనలు వినిపిస్తున్నాయి. కానీ హెడ్‌కోచ్ గంభీర్ మాత్రం రాహుల్‌కు తమ మద్దతు ఉంటుందని చెప్పడంతో సర్ఫరాజ్‌పై వేటు పడనుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక గత టెస్టులో విఫలమైన జైస్వాల్ ఈ మ్యాచ్‌లో బ్యాట్ ఝుళిపించాలని భారత్ కోరుకుంటోంది. ఈ ఏడాది తొలి అర్ధ సెంచరీ చేసిన విరాట్ కోహ్లీ, కెప్టెన్ రోహిత్ కూడా భారీ ఇన్నింగ్స్‌లు బాకీ ఉన్నారు. ఐదేండ్ల క్రితం ఇక్కడ సౌతాఫ్రికాతో జరిగిన టెస్టులో కోహ్లీ 254 పరుగులతో అజేయంగా నిలిచి ఈ ఫార్మాట్‌లో తన అత్యుత్తమ స్కోరును నమోదుచేయగా తాజాగా అదే ప్రదర్శనను పునరావృతం చేయాలని అభిమానులు ఆశిస్తున్నారు. పిచ్ స్పిన్‌కు అనుకూలించనుండటంతో ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు పేసర్లతో భారత్ బరిలోకి దిగే అవకాశముంది. సిరాజ్ స్థానంలో ఆకాశ్ దీప్‌ను ఆడించనున్నట్టు తెలుస్తోంది.

**జోరుమీదున్న కివీస్:** బెంగళూరు టెస్టు ఇచ్చిన విజయంతో జోరుమీదున్న న్యూజిలాండ్.. స్పిన్‌కు స్వర్గధామమైన పుణెలో భారత్‌ను ఇబ్బందులకు గురిచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఆ జట్టు స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ లేకున్నా డెవాన్ కాన్వే, రచిన్ రవీంద్ర, టామ్ లాథమ్, గ్లెన్ ఫిలిప్స్, విల్ యంగ్, డారిల్ మిచెల్ వంటి నాణ్యమైన ఆటగాళ్లు కివీస్ సొంతం. స్పిన్ ఫ్రెండ్లీ పిచ్ కావడంతో మిచెల్ శాంట్నర్‌ను మ్యాచ్ ఆడించే ఆలోచనలో ఆ జట్టు ఉంది. శాంట్నర్, అజాజ్ పటేల్‌తో పాటు రచిన్, ఫిలిప్స్ భారత బ్యాటర్లకు సవాల్ విసరనున్నారు. భారత్‌లో ఇంతవరకూ టెస్టు సిరీస్ గెలవని కివీస్.. పుణెలో అద్భుతం చేస్తే సరికొత్త చరిత్ర సృష్టించినట్టే!

ఉదయం 9:30 గంటల నుంచి స్పోర్ట్స్-18లో లైవ్

**తుది జట్లు (అంచనా)**

**భారత్:** రోహిత్ (కెప్టెన్), జైస్వాల్, గిల్, కోహ్లీ, పంత్, రాహుల్/సర్ఫరాజ్, జడేజా, అశ్విన్, కుల్‌దీప్, బుమ్రా, సిరాజ్/ఆకాశ్

**న్యూజిలాండ్:** లాథమ్ (కెప్టెన్), కాన్వే, యంగ్, రచిన్, మిచెల్, బ్లండెల్, ఫిలిప్స్, సాంట్నర్, సౌథీ/ఓరూర్కే, హెన్రీ, అజాజ్

## జస్టిస్ లావు కమిటీ నివేదికపై సుప్రీం విచారణ

### హెచ్‌సీఏలో క్లబ్‌ల ఆధిపత్యంపై సుదీర్ఘ వాదనలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 23(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో నెలకొన్న వివాదాలు, కుటుంబ పెత్తనం, ఎలక్ట్రోరల్ జాబితా తయారీ, ఎన్నికల నిర్వహణపై జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు కమిటీ నివేదికపై సుప్రీం కోర్టు విచారించింది. బుధవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన ప్రత్యేక ధర్మాసనం విచారణ జరిపింది. దాదాపు గంటన్నర పాటు వాద, ప్రతివాదుల తరపు సీనియర్ అడ్వకేట్లు సిద్దార్థ్ దవే, అమిత్ సిబల్, జయంత్ భూషణ్, రాకేశ్‌కుమార్, విపిన్ సంఘీ, ఏకే ప్రసాద్, గౌరవ్ అగర్వాల్, సుధీర్‌కుమార్ సక్సేనా వాదనలు వినిపించారు. సుదీర్ఘ వాద, ప్రతివాదనల తర్వాత గురువారం మధ్యాహ్నా 2 గంటలకు విచారణ వాయిదా వేస్తున్నట్లు సుప్రీం కోర్టు పేర్కొంది. హెచ్‌సీఏ అధ్యక్ష ఎన్నికల వివాదం, ఓటరు నమోదు తదితర అంశాలపై 30 ఏప్రిల్, 2021లో సుప్రీం కోర్టులో హెచ్‌సీఏ పిటీషన్ దాఖలు చేసింది. ఇందులో చార్మినార్ క్రికెట్ క్లబ్, బడ్డింగ్ స్టార్ క్రికెట్ క్లబ్‌లను ప్రతివాదులుగా చేర్చింది. జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు నేతృత్వంలో ఏకసభ్య కమిటీని సుప్రీం కోర్టు ఏర్పాటు చేసింది. అప్పటికే తీవ్ర అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన హెచ్‌సీఏలో ఏకసభ్య కమిటీ ప్రక్షాళనకు పూనుకుంది. హెచ్‌సీఏ పరిధిలో మొత్తం 217 క్లబ్‌లు ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా కొన్ని కుటుంబాలకు 57 క్లబ్‌లు ఉన్నట్లు గుర్తించింది. క్లబ్‌లను తమ గుప్పిట్లో పెట్టుకుని హెచ్‌సీఏ ఎన్నికలను ప్రభావితం చేస్తున్నారన్న కారణంతో ఆ క్లబ్‌లపై కమిటీ నిషేధం వేసింది. దీన్ని సవాలు చేస్తూ క్లబ్‌లకు చెందిన ప్రతినిధులు సుప్రీంకోర్టులో కేసు వేసిన సంగతి తెలిసిందే.

## రాష్ట్ర చెస్ చాంప్స్ యోహాన్, శరణ్య

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 23: తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించిన అండర్-15 బాలబాలికల రాష్ట్ర స్థాయి చదరంగ పోటీలు బుధవారం ముగిశాయి. బాలుర విభాగం నుంచి యోహాన్, యాదవ్, ప్రణయ్, శ్రీరామ్, అంజనీకుమార్, సాహర్ష, బాలికల కేటగిరీలో యాశ్విజైన్, శరణ్య, సహర్ష, శ్రీలాస్య విజేతలుగా నిలిచారు. వీరంతా నవంబర్ 3 నుంచి 11వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ తరపున పోటీ చేయనున్నారు. పోటీల ముగింపు కార్యక్రమానికి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టోర్నీ నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ ఈ చాంపియన్‌షిషిప్‌లో దాదాపు 100మంది పాల్గొన్నారని పేర్కొన్నారు.

## జింబాబ్వే 344/4

### టీ20ల్లో ప్రపంచ రికార్డు స్కోరు • సికిందర్ రజా సిక్స్‌ల మోత

నైరోబీ: టీ20ల్లో మరో ప్రపంచ రికార్డు బద్దలైంది. రికార్డులకు పెట్టింది పేరైన పొట్టి పోరులో పరుగుల వరద పారింది. టీ20 ప్రపంచ కప్ ఆఫ్రికా రీజినల్ క్వాలిఫయర్‌లో భాగంగా గాంబియాతో జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే 344 స్కోరుతో సరికొత్త రికార్డు నెలకొల్పింది. పరుగుల హోరు వెల్లువెత్తిన ఈ మ్యాచ్‌లో జింబాబ్వే 290 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. గాంబియా బౌలర్లను ఊచకోత కోస్తూ కేవలం 120 బంతుల్లోనే 344 పరుగులు నమోదు చేసి ఇంతకుముందు నేపాల్(314) పేరిట రికార్డును జింబాబ్వే తాజాగా తుడిచిపెట్టింది. కెప్టెన్ సికిందర్ రజా(43 బంతుల్లో 133 నాటౌట్, 7ఫోర్లు, 15సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. గాంబియా బౌలర్లను దునుమాడుతూ తన ఇన్నింగ్స్‌లో ఏకంగా 15 భారీ సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. దొరికిన బౌలర్‌ను దొరికినట్లు బాదుతూ బౌండరీల జడివాన కురిపించాడు. వార్ వన్ సైడ్ అన్నట్లు సాగిన జింబాబ్వే ఇన్నింగ్స్‌లో మొత్తం 30 ఫోర్లు, 27 సిక్స్‌లు నమోదయ్యాయంటే విధ్వంసం ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలో ఇటీవలే బంగ్లాదేశ్‌పై భారత్ నెలకొల్పిన(297) రికార్డును జింబాబ్వే(టెస్టు ఆడే దేశం) దాటేసింది. గాంబియా బౌలర్లలో ముసా జోబర్ట్(93 పరుగులు) అత్యధిక పరుగులిచ్చుకుని చెత్త రికార్డు మూటగట్టుకున్నాడు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన గాంబియా 14.4 ఓవర్లలో 54 పరుగులకు కుప్పకూలింది. జార్జు(12) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. రిచర్డ్ (3/13), బ్రాండన్ (3/10) మూడు వికెట్ల తీశారు. రజాకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

**టీ20ల్లో రికార్డు స్కోర్లు**

| | |
|---|---|
| జింబాబ్వే | 344/4 |
| నేపాల్ | 314/3 |
| భారత్ | 297/6 |

## లిస్ట్-ఏ క్రికెట్‌లో ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ వర్ధమాన క్రికెటర్ చాడ్ బోవ్స్ లిస్ట్-ఏ క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన ద్విశతకాన్ని నమోదుచేశాడు. 103 బంతుల్లోనే అతడు డబుల్ సెంచరీ సాధించి లిస్ట్-ఏ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించడమే గాక ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా), నారాయణ్ జగదీశన్(భారత్) పేరిట ఉన్న రికార్డులను తిరగరాశాడు. హెడ్, జగదీశన్ 114 బంతుల్లోనే ఈ ఘనత సాధించారు. చాడ్ విషయానికొస్తే.. కివీస్ దేశవాళీలో జరుగుతున్న ఫోర్డ్ కప్‌లో క్యాంటర్‌బరీ తరపున ఆడిన అతడు ఒటాగోతో మ్యాచ్‌లో ఈ రికార్డును అందుకున్నాడు. 53 బంతుల్లోనే శతకాన్ని పూర్తిచేసిన అతడు.. 110 బంతులాడి 27 బౌండరీలు,7 భారీ సిక్సర్ల సాయంతో 205 పరుగులు చేశాడు.

## మార్చిలో షూటింగ్ లీగ్

ఢిల్లీ: దేశంలో ప్రజాదరణ పొందుతున్న పలు క్రీడాంశాల ఫ్రాంచైజీ లీగ్‌ల జాబితాలో మరో క్రీడ చేరనున్నది. వచ్చే ఏడాది మార్చి నుంచి దేశంలో షూటింగ్ లీగ్ ఆఫ్ ఇండియా (ఎస్ఎల్ఐ)ను ప్రారంభించనున్నట్టు జాతీయ రైఫిల్ సమాఖ్య(ఎన్ఆర్ఏఐ) తెలిపింది. ఈ మేరకు తమ ప్రతిపాదనలకు గవర్నింగ్ బాడీ ఆమోదముద్ర వేసినట్టు ఎన్ఆర్ఏఐ అధ్యక్షుడు కలికేశ్ నారాయణ్‌సింగ్ దేవ్ తెలిపారు.

## భారత్‌కు చుక్కెదురు

ఢిల్లీ: ఢిల్లీ వేదికగా జర్మనీతో జరుగుతున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భారత్‌కు తొలి మ్యాచ్‌లోనే పరాభవం ఎదురైంది. పదేండ్ల తర్వాత ఢిల్లీలోని ధ్యాన్‌చంద్ జాతీయ స్టేడియంలో బుధవారం జరిగిన మొదటి అంతర్జాతీయ మ్యాచ్‌లో భారత్ 0-2తో జర్మనీ చేతిలో ఓడింది. జర్మనీ తరపున హెన్రిక్ మార్ట్‌గెన్స్ (4వ నిమిషంలో), సారథి లుకాస్ విండ్‌ఫెడర్ (30వ ని.) రెండు గోల్స్ సాధించి ఆ జట్టును విజయపథంలో నడిపారు.

## అమ్మాయిల వన్డే సమరం

నేడు భారత్, న్యూజిలాండ్ తొలి వన్డే

అహ్మదాబాద్: ఇటీవలే దుబాయ్ వేదికగా ముగిసిన ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌ను గెలిచిన జోష్‌లో ఉన్న న్యూజిలాండ్ క్రికెట్ జట్టుతో భారత అమ్మాయిల మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు గురువారం తెరలేవనుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో గురువారం తొలి వన్డే జరుగనుంది. వచ్చే ఏడాది సొంతగడ్డపైనే జరిగే వన్డే ప్రపంచకప్ కోసం ఈ సిరీస్ నుంచే భారత్ సన్నాహకాలను మొదలుపెట్టనుంది.

## భారత్ సెమీస్ ప్రత్యర్థి అఫ్గాన్

అల్ అమరత్ (ఒమన్): పురుషుల టీ20 ఎమర్జింగ్ ఆసియా కప్-2024 సెమీస్‌లో యువ భారత్ అఫ్గానిస్థాన్‌తో తలపడనుంది. బుధవారం ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 6 వికెట్ల తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన ఒమన్ 20 ఓవర్లలో 140/5 పరుగులు చేయగా లక్ష్యాన్ని భారత్ 15.2 ఓవర్లలోనే దంచేసింది. అయూష్ బదోని (51), కెప్టెన్ తిలక్ వర్మ (36 నాటౌట్) భారత విజయంలో కీలకపాత్ర పోషించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.